# దూరభూమి

డోర్‌బెల్ గుండెల్లో బాకులా దూసుకుపోవడంతో అకస్మాత్తుగా మెలుకువ వచ్చింది. సుదర్శనానికి. ఇంత పొద్దున్నే ఎవరు? అని చికాకు పడకుండానే నిద్రమంచం నుంచి లేస్తూ గడియారం వంక చూచాడు. ఆరు గంటల పదిహేను నిమిషాలు తెల్లవారిపోయి ముప్పావు గంట అయింది.

అలా కర్కశంగా మోగే డోర్‌బెల్ తీసేసి సుతారంగా సంగీత ధ్వనులతో పలికే పరికరాన్ని సేకరించాలని దాదాపు సంవత్సరం నుంచి అనుకుంటున్నాడు. కాని యింకా సందర్భపడలేదు. ఎప్పటికప్పుడు యేవో పనులు, పురమాయింపులు అలా మార్చనంతవరకు యీ గుండెపోట్లు తప్పవు.

సుదర్శనం హాల్లోకి వచ్చి తలుపు తీసాడు.

ఎదురుగా ఆంజనేయలు.

'రండి రండి. ఏమిటి యింత పొద్దున్నే వేంచేశారు?' అని అందామనుకుంటూ వుండగానే ఆంజనేయులే ముందు నోరు విప్పాడు. 'అసలు రాత్రే వద్దామనుకున్నాను. మీరు వచ్చీరాగానే ఎందుకు యిబ్బంది పెట్టడం? అని యిప్పుడు వచ్చాను. ఆ ముక్క కాస్తా మీ చెవిని వేస్తే రోజంతా మీరు ఆలోచించుకుందుకు అవకాశం వుంటుంది. కదా! మళ్లీ సాయంకాలం వచ్చి కనబడతాను' అన్నాడు ఆంజనేయులు.

'కూర్చోండి ముందు' అని, సుదర్శనం తానూ ఎదురుగా మరో కుర్చీ లాక్కుని ఆశీనుడయ్యాడు.

'ఊ-చెప్పండి రాత్రి ఎన్ని గంటలకు వచ్చారు? ప్రయాణం బాగా అనుకూలంగా జరిగిందా? ఏమిటి యింకా విశేషాలు?' అన్నాడు ఆంజనేయులు.

సుదర్శనం గొంతు సరిచేసుకుంటూ 'అంతా బాగానే వుందండీ! మధ్యాహ్నం రెండింటికే బయలు దేరగలిగాను కనుక రాత్రి పదింటికల్లా యింటి దగ్గర పడ్డాను ఏమిటో ఎన్నాళ్లో యీ ప్రయాణాల పరంపర!' అన్నాడు.

'అది చెబుదామనే చెప్పబోతూ ఆగాను' అంటూ ఆంజనేయులు కుర్చీ మరికాస్త దగ్గరకు లాక్కున్నాడు. సుదర్శనం మనసులో ఏదో మెదులుతోంది. లేవడం ఆలస్యం

అయిపోయింది. ఏడుగంటలకు ఆంజనేయస్వామి దేవాలయానికి వెడదాం అనుకున్నారు. పొద్దున్నే తెమిలి అనూరాధ యింకా లేవలేదు. ఇంట్లో ఎవరికీ మెలుకువ రాకముందే యీ ఆంజనేయులు ప్రత్యక్షం అయ్యాడు ఇతడు తొందరగా వెళ్లిపోతే...

ఇంకా ఎందుకు వచ్చాడో చెప్పనివాడు, ఎప్పుడు వెళ్లిపోతాడా అని ఆలోచిస్తున్నందుకు తనలో తనే నవ్వుకున్నాడు సుదర్శనం. ఆ నవ్వును పెదవుల మీదకు లాక్కుని 'చెప్పండి...చెప్పండి' అన్నాడు.

'మొన్న మన హెడ్ ఆఫీసు నుంచి దామోదర రావు వచ్చాడు. మీకు తెలుసుగదా అతను?' తిని ఆగాడు ఆంజనేయులు.

'తెలియకేం? చెప్పండి'

'అతను మిమ్మల్ని గురించి విచారించాడు. ఇంకా అతను యిక్కడికీ అక్కడికీ అప్ అండ్ డౌన్ చేస్తూనే వున్నాడా? పాపం! యీ స్థితి మెరుగు పరుచుకోవాలని లేదా?' అని అడిగాడు.

సుదర్శనానికి నవ్వాలో ఏడవాలో అర్థం కాలేదు. ఆరునెలలుగా యీ దుస్థితి నుంచి బయట పడాలని శతధా ప్రయత్నం చేస్తున్నా కాలం కలిసి రావడం లేదు. అని తను ఒక పక్క అఘోరిస్తూవుంటే...ఒడ్డున కూర్చున్నవాడు మటుకు యీ విషయంలో తనకు అభిరుచే లేదనుకుంటున్నాడు. ఎంత విచిత్రం!! అందరి జీవితాలూ అందరికీ ట్రాన్స్‌పరెంట్ అయిపోతే యిలాంటి దిక్కులు వుండవు గదా!

'మరి మీరేం అన్నారు? యింతకూ అతను యేదన్నా మార్గం చెప్పాడా? ఊరికే లిప్ సింపతీ మటుకేనా?' అన్నాడు సుదర్శనం.

న్యూస్ పేపర్ బాయ్ వచ్చి పత్రికలు పడవేసి వెళ్లాడు.

ఆంజనేయులు ఒక తెలుగు పత్రిక చేతిలోనికి తీసుకున్నాడు. దాని హెడ్డింగ్ వంక తీక్షణంగా చూస్తూ 'చెప్పకేం?' చెప్పాడు. 'అందుకోసమే ఉదయమే వచ్చాను' అన్నాడు. 'సుదర్శనాన్ని ఒకమారు హెడ్ ఆఫీసుకు రమ్మనండి. ఫలానా డైరెక్టర్‌ను చూడమ్మనండి. ఒక్క యాభయివేలు మనవి కాదనుకుంటే అతను మళ్లీ యిక్కడే కులాసాగా ఉద్యోగం చేసుకోవచ్చును. మరో అయిదేళ్ల వరకు పేచీ వుండదు' యిదీ ఆంజనేయులు తీసుకు వచ్చిన సమాచారం. 'దామోదరరావు కూడా అవసరం అయిన సహాయం చేస్తానని భరోసా యిచ్చాడు.'

'ఉద్యోగం బదిలీ కోసం లంచం యివ్వడమా?' అనేశాడు పైకే సుదర్శనం.

'పెద్దగా అనకండి గోడలకు చెవులు వుంటాయి. దీన్ని ఈ రోజుల్లో లంచం అనడం లేదుగా ఎవరూ?

న్యూస్ పేపర్ ఎడిటోరియల్ కూడా చూసి పక్కనే పడేసి 'సరే మీరు ఆలోచించుకోండి సాయంత్రం వస్తాను. మాట్లాడుకుందాం. అయిదున్నర ప్రాంతంలో ఖాళీగానే వుంటారుగా'

అన్నాతు అంజనేయులు.

'అయ్యో ఉండండి టీ అన్నా యివ్వలేదు మీకు నేనింకా కూచోండి ఒక్క నిమిషం' అన్నాతు సుదర్శనం.

ఇంట్లో అలికిడి లేకపోవడంతో ఆంజనేయులుకు పరిస్థితి తేలికగానే అర్థం అయింది అంటా ఆమెగారు లేవలేదన్నమాట. ఇతనే చేతులు కాల్చుకుంటాడో లేక ఆమెకు మేలుకొలుపులే పాడతాడో సరే యేమయినాకానీ అనుకుని' ఇప్పుడు అదేం వద్దండీ. మనలో మనకు ఫార్మాలిటీస్ యేమిటి? నాకవతల బోలెడు పనులున్నాయి. యీ ముక్క మీ చెవిని వేసి వెడదామని వచ్చా అంతే!... మీకు యేవో పనులు వుంటాయిగా అవన్నీ చూసుకోండి సాయంత్రం వస్తాగా... అప్పుడు యిద్దరుగాని టీ, బిస్కట్లు' అంటూ అంజనేయలు ఎక్కువ ఆలస్యం చేయకుండా వెళ్లిపోయాడు.

సుదర్శనం తలుపులు దగ్గరగా వేసుకుని మళ్లీ పడకగదిలోనికి వెళ్లాడు. అనూరాధ యింకా నిద్రపోతూనే వుంది. పాపం! ఎంత అలసిపోయిందో! ఆ ముఖం చూడడంతోటే అతనికి ఆప్యాయత ఉబికి వచ్చింది. అడుగు ముందుకేసి ఆమెను లేపుదాం అనుకున్నాడు. భుజం మీద చేయి వేసాడు. ఆమె కదిలింది. సుదర్శనం చేయి యివతలకు లాక్కుని మళ్లీ ఆమె ముఖం వంక చూశాడు. ఈ అందం ఈ కనుముక్కు తీరు... చెక్కు చెదరకుండా అనుక్షణమూ కనిపించే ప్రశాంతత... వీటి కోసమే ఆమెను పెళ్లి చేసుకున్నాను అని గుర్తు తెచ్చుకున్నాడు. కాని అతని ఆలోచనలు ఆమెలో అలారం లాగా మోగినట్లున్నాయి. లేచి కూర్చుంది. 'అబ్బ అప్పుడే లేచిపోయారే ఎంతయింది టైం?' అంటూ అతని జవాబు కోసం చూడకుండానే గోడగడియారం వంక చూసింది. 'అబ్బా! ఆరూ నలభై! మీరు లేవగానే నన్నూ లేపి వుండవలసిందీ. ఆలస్యం అయిపోయింది. మళ్లీ ఏడు గంటలకల్లా బయలుదేరుదాం కదూ?' అంటూ మంచం మీద నుంచి దూకినట్లుగా కిందకు జారి బాత్‌రూం లోనికి వెళ్లిపోయింది.

సుదర్శనం 'పోనీలే ఆలస్యంగా వెడదాం. ఏమయిపోతుంది గనుక' అంటూ ఆంజనేయులు చెప్పిన సంగతి నెమరు వేసుకుంటున్నాడు. అతను సాయంత్రం వస్తానన్నాడు. ఈ లోపల ఆలోచించుకోమన్నాడు ఇందులో ఆలోచించవలసింది ఏముంది? ఇలాంటి వాటికి తాను పూర్తిగా వ్యతిరేకి తనదాకా వచ్చినప్పుడు అంతవరకు వల్లెవేస్తున్న నీతి సూత్రాలను-ఒట్టుతీసి గట్టున పెట్టినట్లుగా - ఏమీ ఎరగనట్లు ప్రవర్తించడం తనవల్లకాదు.

భారతదేశానికి నవజీవనం రావాలి. ప్రజలందరికీ రుజువర్తనం అలవాటు అయిపోతే తప్ప యీ రకమైన కొత్త జీవితం, ధార్మికతకు తాత్వికతకు మూలరూపం అయిన జీవితం దేశంలో నెలకొనదని హృదయపూర్వకంగా నమ్మేవాళ్లల్లో సుదర్శనం ఒకడు. 'పోనీ ఉద్యోగం మానివేయరాదా? అక్కడే యింకొకటి చూసుకోవచ్చునేమో' అని సూచించాడు అనురాధకు

తనకు బదిలీ అయిన కొత్తలో.

'నేడో రేపో రీడర్ అవుతాను. కొత్తగా ఉద్యోగంలో చేరితే మళ్లీ ప్రారంభం అయినట్లేగా కెరియర్? ఎందుకు ఆరేళ్ల సర్వీస్ వదులుకోవడం' అంది ఆమె. ఓ ప్రయివేట్ కాలేజీలో 'పాపులేషన్ స్టడీస్'లో లెక్చరర్ ఆమె. సబ్జెక్ట్ ప్రతి ఊళ్లోనూ ప్రతి కాలేజీలోనూ వుండేది కాదు. ప్రయివేట్ కాలేజీ అవడం వల్ల బదిలీలు అవుతాయనే భయం లేదు ఆమెకు.

అనుకోకుండా బదిలీ అయింది సుదర్శనానికి.

కాకపోతే-ఓదార్పు యేమిటంటే పక్క రాష్ట్రానికే బదిలీ అయింది. దక్షిణం నుంచి ఉత్తరానికి పడమర నుంచి తూర్పుకూ కాదు. 'ఓవర్‌నైట్ జర్నీ'లో ఉద్యోగపు నగరానికి వెళ్లగలడు. అలాగే తిరిగి రాగలడు. ఎనిమిది గంటలు చాలు ప్రయాణానికి బదిలీని అపుచేసుకుందామని ప్రయత్నం చేశాడు. ముందు అయినా ఉద్యోగం అన్న తరువాత బదిలీలవీ వుండవా? అన్నీ తనకు తెలుసుననుకోవడం వల్ల ఎన్నో కుశ్శంకలు ధర్మ సందేహాలు వచ్చి వాకిట్లో నిలుస్తాయి. ఎన్ని సందర్భాలు చూడలేదు? ఎంతమంది ఉన్న వూళ్లోనే వుద్యోగాలు సంపాదించి అలా చూస్తూ చూస్తూ వుండగానే ఆకాశం వరకూ ఎదిగి రిటైరయిపోయి కాలు మీద కాలు వేసుకు గడపడం లేదు?

పై అధికారి - హెడ్డాఫీసులో ఇలాంటి బదిలీలు పెర్సానెల్ విషయాలు చూసే అతన్ని కలుసుకున్నాడు. 'ముందు వెళ్లి చేరండి. తర్వాత చూద్దాం' అన్నాడు ఆయన ముందు.

తర్వాత చూసినప్పుడు ఎంతో ఓపికగా తన యిబ్బందులన్నీ విని సానుభూతిగా ముఖం పెట్టి 'మీరు చెప్పిందంతా వింటే నాకు జాలిగానే వుంది. కాని నేనేం చేయగలను? నిస్సహాయుడిని. మీ టరమ్ మీరు పక్క రాష్ట్రంలో పనిచేయవలసిందే' అన్నాడు. ఉద్యోగాలు - ఉద్యోగులు - సమరస వాతావరణం - యిలాంటి మామూలు విషయాలన్నీ కొత్త అవగాహన యిస్తున్నట్లుగా మాట్లాడుతూ ఆయనే అన్నాడు తరువాత: 'చూడండి ఇందులో నా ప్రమేయం యేమీ లేదు. మీలాటి ప్రత్యేక అధికారులు మన డిపార్ట్‌మెంటలో ముప్ఫయి ఆరుగురు వున్నారు. మీకు తెలుసుగదా. ఈ ముప్ఫయి ఆరు పోస్టులు దేశం మొత్తం మీద అనేక ప్రాంతాలలో రాష్ట్రాలలో విసిరివేసినట్లుగా వున్నాయి. ఎక్కడికో ఒక చోటుకు బదిలీ చేసేద్దాం అంటే యిదేమన్నా గుమాస్తా ఉద్యోగమా? ముప్ఫయి ఆరుచోట్ల నిడివిడిగా వుండవలసిందే. ఆ ముప్ఫయి ఆరుమందిలో ఎవరు ఎక్కడు వుంటే మటుకు నాకు ఒరిగేది యేముంది? మీ ఊళ్లోనే ఉద్యోగం వుండడం మీకు లాయకీ కావచ్చును. కాని నాకు దానివల్ల యేం లాభం వుంది నాయనా?'

ఒక్క క్షణం విరామం యిచ్చి 'అయినా మీ తెలుగులోనే ఒక సామెత వుందిగదా. బహుశా మీకు తెలిసే వుంటుంది. తెలియకుండా వుండదు. 'ఉద్యోగికి దూరభూమి లేదు' అని. అందుకని మళ్లీ యేదో అవకాశం వచ్చి మీ ఊరికి మీకు బదిలీ అయ్యేంత వరకూ

ఒకేక పక్షి తిన్నగా పని చేసుకుంటూ వుండండి' అన్నాడు.

ఆయన మాటలను ఎలా అర్థం చేసుకోవాలో తెలియలేదు. అయినా ఆశీర్వచనంగానే తీసుకుని బయటకు వచ్చేశాడు సుదర్శనం.

పోయినసారి యింటికి వచ్చినప్పుడు అంది అనూరాధ 'మీ హెడ్ ఆఫీస్ పెర్సొనెల్ డైరెక్టర్ ఆంజనేయ ఉపాసకుడుట. నాకు ఎవరో యీ విషయం చెప్పారు'.

'అవును, అందరూ ఆ విషయం వేళాకోళంగా చెప్పుకుంటూ వుంటారు. ఆఫీసులో' అన్నాడు సుదర్శనం.

'వాళ్లు ఎలాగైనా చెప్పుకోనీండి. మీరు ఆంజనేయుడి అనుగ్రహం సంపాదిస్తే ఆయనంత ఆయనకే సద్బుద్ధి కలిగి మిమ్మల్ని యిక్కడికి బదిలీ చేసేస్తాడని నా నమ్మకం' అంది ఆమె.

ఇలాంటి నమ్మకాలు యే 'పాపులేషన్ స్టడీస్‌లో భాగమో సుదర్శనం ఎరగడు. తాను చదువుకున్న ఎకౌంటెన్సీలో మాత్రం లేవు.

నమ్మకాలకు మూఢ నమ్మకాలకు వ్యత్యాసం వెంట్రుకవాసి.

నమ్మకాలన్నీ వమ్మయిపోయిన అపనమ్మకాలే ఆచారాలు అయిపోతున్న రోజులు -అని నిట్టూర్చాడు.

అనురాధే చెప్పింది: 'నమ్మకం అపనమ్మకం అంటూ దాని తత్వం వెదికి పట్టుకోవలసిన అవసరం లేదు మనకు. కావలసిందల్లా పని కావడం మనకు జరిగే మంచి వల్ల మరొకళ్లకు అపకారం జరగకుండా వుండడం అంతేకదూ?'

ఆమె దేనికి దారి తీస్తోందో సుదర్శం అంచనా వేయలేకపోయాడు. తాను ఊళ్లో లేకపోవడం ఆమె యిబ్బందులను అధికం చేస్తున్నందుకు అతనికి విచారం ఎక్కువయింది. ఆమెను దగ్గరగా తీసుకొని ఓదార్చాలనిపించింది. లేనిపోని 'సెంటిమెంట్లతో' మనస్సు పాడుచేసుకోగూడదని తమాయించుకు వుండిపోయాడు.

'మన ఊళ్లోనే కొత్తపేటలో ఆంజనేయస్వామి దేవాలయం వుందిట! ఆ దరీవుడికి చాలా మహత్యం వుందని ఈ మధ్య పేపర్లో గూడా పెద్ద వ్యాసం ఫొటోలతో సహవేశారు. ఏడు ఆదివారాలు వరుసగా ఆయనకు ప్రదక్షిణలు చేసి వస్తే మనకు ఉపకారం జరుగుతుందని మా కెమిస్ట్రీ లెక్చరర్ మందాకిని చెప్పింది. ఏమంటారు?' అనడిగింది అనూరాధ.

తెలుగు లెక్చరర్ కాదు యీ సూచన యిచ్చింది. కెమిస్ట్రీ లెక్చరర్ గనుక శాస్త్ర పారాలు కూడా వున్నాయని అనుకోవాలా?

ప్రదిక్షిణాలు చేస్తే ప్రయోజనం వుంటుంది.

ఉన్నా ఉండక పోయినా 'నష్టం' యేమీ జరగదు.

నష్టపోయేదల్లా తన అభిప్రాయాలూ ఆలోచనలే.

పరీక్షపెట్టిచూసుకుంటే మరేం తప్పులేదు.

తనకు బదిలీ జరిగిపోతే ఆ స్వామికి 'మహాత్మ్యం' వున్నట్లు లేకపోతే లేదు.

...సుదర్శనం ఎటూ తేల్చుకోలేక పోయాడు.

అనూరాధ చెప్పింది అంగీకరించాలా వద్దా?

అంగీకరించకపోతే, మీ సిద్ధాంతాల కోసం నా కాపురం... మన సంసారసుఖం త్యాగం చేస్తారా? అంటుంది.

జ్వరం వచ్చినప్పుడు డాక్టర్ దగ్గరకు వెళ్లకుండా ఆంజనేయ స్వామి గుడిలో సింధూరం తెచ్చుకుని నొసట పెట్టుకునే వాళ్లు వున్నారు. అంది అనూరాధ ఉత్త జ్వరానికే ఎవరూ డాక్టర్ దగ్గరకు వెళ్లరు. అదే తగ్గిపోతుందిలే అని నాలుగయిదు రోజులు ఉపేక్ష చేస్తారు. అప్పటికీ తగ్గకపోతే అప్పుడు డాక్టర్లు స్పెషలిస్టులూ...!

డాక్టర్లలో స్పెషలిస్టులు వున్నట్లుగా దేవుళ్లు దేవతలలోనూ ప్రత్యేక వరాలు యిచ్చే ఫోర్టుపోలియోలు వున్నాయనిపిస్తుంది. సుదర్శనానికి జ్వరం తగ్గాలంటే ఒకరు పిల్లలు కావాలంటే ఒకరు పిల్లలకు చదువులు బాగా రావాలంటే ఒకరు పెళ్లిళ్లయి సంతానోత్పత్తి కలగాలంటే వేరొకరు, ధన కనక వస్తువాహనాలు సమకూడాలంటే ఇంకొకరు ఇలా ఎవరి శాఖకు సంబంధించిన వరాలు వాళ్లు యిస్తూ వుంటారన్న మాట, భూలోకంలో లాగానే సుదర్శనానికి నవ్వు వచ్చింది.

'ఎందుకు నవ్వుతారు? పోనీ వెళ్లి చూద్దాం. నష్టం ఏమిటి? పై ఆదివారం మీరు వచ్చినప్పుడు ఉదయం యేడుగంటలకే అక్కడకు వెళ్లివద్దాం' అంది అనూరాధ.

'ముహూర్తం కూడా పెట్టేశావా?'

'ఆదివారం మనకు అనుకూలం అయిన రోజు. ఏడుగంటలు దాటి పోయిందంటే రద్దీ ఎక్కువయి పోతుంది. జనసమ్మర్థం లేకుండా గుట్టు చప్పుడు కాకుండా వెళ్లి వద్దామని! అంతే!' అంది అనూరాధ.

రాత్రి తాను వచ్చిన తరువాత ఈ ప్రస్తావన మళ్లీ యిద్దరి మధ్యా రానే లేదు. అయినా యిద్దరికీ అంతరాంతరాలలో యీ ప్రయాణం గురించి సన్నాహమే మెదులుతూ వుందన్న మాట.

అనూరాధ బాత్‌రూం నుంచి యివతలకు వచ్చిన తర్వాత సుదర్శనం కాస్త నీరసంగా గుండె పట్టుకు కూర్చున్నట్లుగా కనిపించాడు.

'ఏం అలా వున్నారు? వంట్లో బాగానే వుంది కదా' అనడిగింది. అనూరాధ ముఖంలో ఏమాత్రం ఆదుర్దా - భయం కనిపించకుండా జాగ్రత్త పడుతూ గుండె 'ఎన్‌లార్జ్' అవటానికి ప్రారంభిస్తోందనీ, తీసుకోవలసిన జాగ్రత్తలు చాలా వున్నాయనీ' డాక్టర్ నాలుగు రోజుల క్రితం చెప్పిన సంగతి ఆమెకు తెలపాలనిపించలేదు. అతడికి. మరేం ప్రమాదం లేదని డాక్టరే అన్నాడు. పైగా అతను చెప్పినవన్నీ ముందు జాగ్రత్తలే. ఇప్పటికే ఆందోళనతో,

వేగిపోతున్న అనూరాధను యింకా యిబ్బందిలో పడవేయడం ఎందుకూ? అంతగా అయితే యీ ప్రాజెక్ట్ నెల, రెండు నెలల్లో ఒక కొలిక్కి తెచ్చి 'నాలుగైదు నెలలపాటు' సెలవు తీసుకుని యింటి పట్టున వుండిపోవచ్చును. ఆ తర్వాత యేం అవుతుందో - అప్పటి మాట, ఇప్పటి నుంచీ ఆలోచన చేయడం అనవసర కాలయాపన!' అనుకున్నాడు సుదర్శనం.

గడియారం ఏడు గంటలు కొట్టింది.

ఆంధ్రజ్యోతి-ఆదివారం, 1999

◆